సాక్షి కామారెడ్డి

శుక్రవారం । 17 । జనవరి । 2025



బడి బయట పిల్లల గుర్తింపు

బడి మానేసి పనులకు వెళ్తున్న చిన్నారులను గుర్తించి సీఆర్పీలు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

- 9లో ▸



కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభం

ఎల్లారెడ్డి పట్టణంలో ఎమ్మెల్యే మదనన్న కబడ్డీ టోర్నమెంట్‌ను గురువారం ఆర్డీవో ప్రభాకర్ ప్రారంభించారు.

- 9లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
32.0 /15.5

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత తగ్గే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ఉచిత వైద్య శిబిరం అభినందనీయం



దోమకొండ: ప్రజల కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని అదనపు కలెక్టర్ విక్టర్ అన్నారు. మండలంలోని అంచనూరులో గురువారం హార్వెస్ట్ మినిస్ట్రీస్, హ్యాండ్ ఆఫ్ హోప్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని అదనపు కలెక్టర్ సందర్శించారు. శిబిరంలో దంత, కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. హార్వెస్ట్ మినిస్ట్రీస్ డైరెక్టర్ డాక్టర్ క్యాలేబ్ రాయపాటి, పాస్టర్ రత్నాకర్ హార్వెస్, తహసీల్దార్ సంజయ్ రావు, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, మాజీ జెడ్పీటీసీ తీగల తిరుమల్ గౌడ్, బురాని మమత, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాంతీయ రవాణా అథారిటీ మెంబర్‌గా ఎజాజ్‌ఖాన్



కామారెడ్డి క్రైం: కామారెడ్డి జిల్లాకు సంబంధించి ప్రాంతీయ రవాణా అథారిటీ మెంబర్‌గా మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లికి చెందిన ఎజాజ్ ఖాన్ నియమితులయ్యారు. గురువారం రాష్ట్ర రవాణా శాఖ నుంచి ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా ఎజాజ్ ఖాన్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

తపాలా సేవలు ప్రజలకు చేరువ చేయాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): తపాలా సేవలు ప్రజలకు మరింత చేరువ చేయాలని జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ జనార్దన్‌రెడ్డి సూచించారు. లింగంపేట సొసైటీ ఛాంబర్‌లో గురువారం ఆయన లింగంపేట, గాంధారి, తాడ్వాయి మండలాల పరిధిలోని బీపీఎంలతో సమావేశం నిర్వహించారు. తపాలా జీవిత బీమా, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలు, ఐపీపీబీ ఖాతాల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. పెన్షన్లు, ఉపాధి హామీ పథకం డబ్బుల చెల్లింపులో సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కామారెడ్డి తపాలా ఇన్‌స్పెక్టర్ సుజిత్‌కుమార్, పోస్టల్ పేమెంట్ బ్యాంకు మేనేజర్ పవన్‌రెడ్డి, మెయిన్ ఓవర్ సీనియర్ మహబూబ్‌రెడ్డి, లింగంపేట సబ్ పోస్టుమాస్టర్ సూర్యకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మెల్లకుంటతండాలో గురువారం సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్(ఎస్‌ఎస్‌టీ) ఆధ్వర్యంలో కెనరా బ్యాంకు సహకారంతో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎస్‌టీ జిల్లా కో–ఆర్డినేటర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. మనం సంపాదించే సొమ్ములో కొంత మొత్తాన్ని పిల్లల భవిష్యత్తు కోసం పొదుపు చేయాలని చెప్పారు. పొదుపు చేసే మొత్తాన్ని తప్పనిసరిగా బ్యాంకు ఖాతాల్లో జమ చేసుకోవాలన్నారు. అలాగే బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎస్‌ఎస్‌టీ కౌన్సిలర్లు మన్నె కృష్ణ, జోడు లక్ష్మణ్, తండా పెద్దలు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలలో పోస్టుల భర్తీకి దరఖాస్తులు

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేశామని ప్రిన్సిపాల్ శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొఫెసర్ 8, అసోసియేట్ ప్రొఫెసర్ 2, అసిస్టెంట్ ప్రొఫెసర్ 28, ట్యూటర్ 4, జూనియర్ రెసిడెంట్ 18, సివిల్ అసిస్టెంట్ సర్జన్ 7 పోస్టులను భర్తీ చేస్తామన్నారు. ఈ నెల 17 నుంచి 20 వరకు దరఖాస్తులను కళాశాలలో అందజేయాలన్నారు. ఈ నెల 20న ఉదయం 11 గంటలకు సర్టిఫికెట్ వెరిఫికేషన్, 21న ఫైనల్ ఇంటర్వ్యూ ఉంటుందన్నారు.

వీడని డెత్ మిస్టరీ!

- మూడు వారాలు గడిచినా కొలిక్కిరాని కేసు
- అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువులో ముగ్గురి మరణంపై అదే సస్పెన్స్
- సాక్షులు, నిందితులు, బాధితులూ లేని కేసు



ఎస్సై సాయికుమార్ (ఫైల్)



ముగ్గురు నీట మునిగిన అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు



కానిస్టేబుల్ శృతి (ఫైల్)



నిఖిల్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : అడ్లూర్ చెరువులో ముగ్గురు చనిపోయిన కేసు మిస్టరీ వీడటం లేదు. ఎస్సైతో పాటు మహిళా కానిస్టేబుల్ మరో యువకుడు అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువులో మునిగి చనిపోయిన విషయం తెలిసిందే. ఘటన జరిగి మూడు వారాలు గడిచినా మిస్టరీ వీడడం లేదు. ఈ కేసులో సాక్ష్యులు లేరు. నేరస్తులు లేరు. బాధితులూ లేకపోవడంతో పోలీసులు ఎటూ తేల్చలేకపోతున్నారు. ఆ ముగ్గురు ఎందుకు చనిపోయారన్న దానికి సంబంధించి సరైన ఆధారాలు దొరక్కపోవడంతోనే కేసు కొలిక్కి రావడం లేదని తెలుస్తోంది. సాంకేతిక ఆధారాలే కీలకంగా మారడంతో ముగ్గురికి సంబంధించిన ఫోన్లలో దొరికే డాటా కోసం సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. అందులో కూడా కేసును ముందుకు తీసుకు వెళ్లేందుకు కావాల్సిన ఆధారాలు లేవని తెలుస్తోంది. గత నెల 25న భిక్కనూరు ఎస్సై సాయికుమార్, బీబీపేట పోలీసు స్టేషన్ కానిస్టేబుల్ శృతి, అదే గ్రామానికి చెందిన నిఖిల్ సదాశివనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువులో చనిపోయిన విషయం తెలిసిందే. మృతుల్లో ఎస్సై, కానిస్టేబుల్ ఉండడంతో పోలీసు ఉన్నతాధికారులు అన్ని కోణాల్లో పరిశీలించారు. కేసును త్వరితగతిన తేల్చాలని భావించినా సరైన ఆధారాలు దొరక్కపోవడంతో సాంకేతిక అంశాలపై ఆధారపడాల్సి వచ్చింది. ఘటన జరిగిన ప్రాంతంలో ఎక్కడా కూడా సీసీ కెమెరాలు లేకపోవడంతో ఎటూ తేల్చలేని పరిస్థితి ఏర్పడింది.

సైబర్ ఫోరెన్సిక్ పరీక్షలు

మృతుల ఫోన్‌లో ఏమైనా సమాచారం దొరుకుతుందేమోనని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. అందులో ఇప్పటికే కొంత సమాచారం లభించినట్లు తెలుస్తోంది. ముగ్గురి మధ్య ఉన్న పరిచయాలు, వాళ్ల మధ్య జరిగిన చాటింగ్, మాట్లాడిన కాల్‌డేటా వివరాలతో నివేదికను రూపొందించి పోలీసు ఉన్నతాధికారులకు పంపించినట్లు సమాచారం. కేసులో ప్రత్యక్ష సాక్ష్యులు ఎవరూ లేకపోవడం, బాధితులు, నిందితులూ లేకపోవడంతో సైబర్ ఫోరెన్సిక్ పరీక్షల రిపోర్టుతో కేసును కొలిక్కి తేనున్నారు. పోస్టుమార్టం నివేదికలు, ఫోరెన్సిక్ నివేదికల ప్రకారం ముగ్గురు నీట మునిగి చనిపోయినట్టు నిర్ధారణ అయ్యింది. అలాగే వీరి మరణాలకు ఇతరులెవరూ కారణం కాదని కూడా స్పష్టమైంది. దీంతో కేసులో బలం లేకుండాపోయింది. ఎక్కడో ఒక దగ్గర క్లోజ్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

చిత్రమైన కేసు

ఏదైనా కేసులో ఎవరో ఒకరు చెరువులో పడి చనిపోతే దానికి ఎవరో ఒకరు కారణమవుతారు. బాధ్యులను పట్టుకుని విచారణ జరిపి చావుకు గల కారణాలను తెలుసుకుంటారు. కొన్ని సందర్భాల్లో ఇద్దరు కలిసి చనిపోయినపుడు వారి గత చరిత్ర తెలుసుకుని ఇద్దరి చావు కేసుకు వాళ్ల మధ్య ఉన్న సంబంధాలను వెల్లడిస్తారు. ఇక్కడ మాత్రం విచిత్రంగా ముగ్గురు చనిపోవడంతో ఈ కేసును విచిత్రమైనదిగానే భావిస్తున్నారు. చనిపోయిన వారిలో ఎస్సై, కానిస్టేబుల్ ఉండడం, మరో యువకుడు కూడా ఉండడంతో ఎటూ తేల్చలేని పరిస్థితి. ఇందులో ఎవరో ఇద్దరు చనిపోయి ఉంటే, మూడో వ్యక్తి గురించి ఆరా తీసి కారణాలు తేల్చేవారు. కానీ ముగ్గురికి ముగ్గురు ఏకకాలంలో చనిపోవడంతో ఎటూ తేల్చలేకపోతున్నారు. ముగ్గురి మరణంపై అనేక ఊహాగానాలు, అనుమానాలు వ్యక్తమైనా ప్రత్యక్ష సాక్ష్యులు గానీ, సాక్షాధారాలు గానీ లేకపోవడంతో కేసు ముందుకు వెళ్లడం లేదు. చెరువు వద్దకు ఎందుకు వెళ్లారు? అక్కడ ఏమైనా గొడవ పడ్డారా? ఎవరు ముందు దూకి ఉంటారు? ఒకరిని కాపాడేందుకు ఒకరి వెంట ఒకరు చెరువులోకి దిగారా? ఇద్దరు దూకడంతో తమ పైకి వస్తుందని మిగిలిన వ్యక్తి దూకాడా ? ఇలా ఎన్నో అనుమానాలు వ్యక్తమయ్యాయి. కానీ ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో కేసు పరిశోధన ముందుకు వెళ్లడం లేదని తెలుస్తోంది.

రోడ్డు భద్రతపై అవగాహన ఉండాలి



హెల్మెట్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

లింగంపేట(ఎల్లారెడ్డి): రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. లింగంపేటలో హైకోర్టు న్యాయవాది, సామాజిక కార్యకర్త మోహిన్ హమ్మద్ ఖాద్రీ ఫామ్ హౌజ్‌లో ఏర్పాటు చేసిన జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఫోన్ మాట్లాడుతూ, మత్తు పదార్థాలు సేవించి వాహనాలు నడుపొద్దని సూచించారు. జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంతోనే ఎక్కువ శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. వాహనాలు నడిపే సమయంలో కుటుంబ సభ్యులను దృష్టిలో పెట్టుకొని వాహనాలు నడపాలన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమని కలెక్టర్ సంగ్వాన్ అన్నారు. లింగంపేటలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరంలో 200 మందికిపైగా రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. రక్తదానం చేసిన వారికి న్యాయవాది ఖాద్రీ హెల్మెట్లు పంపిణీ చేయడాన్ని కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయనను కలెక్టర్ సన్మానించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డి, ఆర్డీవో ప్రభాకర్, డీఎస్పీ శ్రీనివాసులు, డీఆర్‌డీవో సురేందర్, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ రాజన్న, రెడ్‌క్రాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సంజీవరెడ్డి పాల్గొన్నారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి



తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

తాడ్వాయి(ఎల్లారెడ్డి): రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహిస్తున్న సర్వేను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. తాడ్వాయి మండల కేంద్రంలో కొనసాగుతున్న సర్వేను గురువారం ఆయన పరిశీలించారు. సర్వేను అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. సర్వే ఎలా చేయాలో అధికారులకు వివరించారు. ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు వెళ్లి సర్వే చేయాలన్నారు. ఈ నెల 21నుంచి 24వరకు గ్రామసభలను ఏర్పాటు చేసి లబ్ధిదారులను గుర్తించాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి సర్వే రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలోఆర్డీవో రంగనాథ్‌రావు, ఎంపీడీవో సయ్యద్ సాజీద్ అలీ, తహసీల్దార్ రహిమొద్దీన్, ఎంపీవో సవితారెడ్డి, ఏవో నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఆడ, మగ సాగు.. ఆదాయం మెండు

- సాగుకు ఆసక్తి చూపుతున్న రైతులు
- రైతులతో ఒప్పందం చేసుకుంటున్న కంపెనీలు



వీరన్నగుట్టలో ఆడ, మగ నారును వేరు చేస్తున్న కూలీలు

రెంజల్(బోధన్): ఆడ, మగ రకం వరి సాగుకు బోధన్ నియోజకవర్గంలో ఆదరణ పెరుగుతోంది. కంపెనీలు పోటీపడి రైతులతో ఒప్పందం చేసుకుంటున్నాయి. పలు కంపెనీలు రైతులను నూతన పద్ధతులను ప్రోత్సహిస్తు పంట సాగును పెంచుతున్నాయి. రైతులతో ఒప్పందం చేసుకొని విత్తనోత్పత్తి నుంచి పంట నూర్పిడి వరకు అవసరమైన సలహాలు, సూచనలను ఆయా కంపెనీల ప్రతినిధులు అందిస్తున్నారు. ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల వరకు పండిస్తే రూ.80 వేల నుంచి రూ. 90 వేల వరకు, పది క్వింటాళ్ల కంటే ఎక్కువ పండిస్తే అదనంగా క్వింటాకు ధరను చెల్లిస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. విత్తనంతో పాటు ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణంలో మార్పులు వచ్చి చీడపీడలు వచ్చి పంట దిగుబడి తగ్గినా రైతుకు ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం చెల్లిస్తున్నారు. రైతు నిర్లక్ష్యంతో కలుపుతీత, బెరుకులు వస్తే కంపెనీ ప్రతినిధులు ధర తగ్గించి తీసుకుంటారు. పలు రకాల వెరైటీలను రైతులు సాగు చేస్తున్నారు. ఒక్కో రైతు ఒక్కో కంపెనీ నిబంధనల ప్రకారం వారి సూచించిన విధంగా సాగు చేయాల్సి ఉంటుంది.

ఎక్కువ కష్టం

సాగు పద్ధతుల్లో ఎక్కువ కష్టం ఉన్నా అందుకు తగిన విధంగా ఆదాయం రైతుకు లభిస్తుంది. సాధారణ వరి రకాలకు ఎకరాకు రూ.25 నుంచి రూ.35 వేల వరకు ఆదాయం వస్తే ఈ పద్ధతిలో సాగు చేసిన పంటకు రూ.70 వేల నుంచి రూ.లక్ష వరకు ఆదాయం పొందవచ్చు. ప్రత్యేక పద్ధతుల ద్వార చివరి వరకు రైతు దగ్గరుండి తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ఆడ, మగ విత్తనాలకు వేర్వేరుగా నారుమడులు వేయాల్సి ఉంటుంది. ముందుగా మగ రకం నారు మడి వేసిన వారం రోజులకు ఆడ రకం నారుమడిని సిద్ధం చేయాలి. 21 రోజుల్లో నాట్లు ప్రారంభించాలి.

నాటు ప్రత్యేకత

ఆడ, మగ నాటు ప్రత్యేకంగా ఉంటుంది. నారుమడి వచ్చిన తర్వాత నిబంధనల ప్రకారం కర్రలు, తాళ్లతో కొలతలు చేసి రెండు లైన్లను మగ, మధ్యలో ఐదు లైన్లను ఆడ రకం నారు నాటాలి. ఎక్కడా లోపం ఏర్పడినా ధాన్యం మొత్తం తాళుగా మారుతుంది. పూత దశలో ఈ రెండింటిని సంకరం చేయాల్సి ఉంటుంది. చేతికి వచ్చిన తర్వాత ముందుగా మగ వరి సాళ్లను కోసి పక్కన పెడతారు. తర్వాత ఆడ వరిలో బెరుకులు ఉంటే తొలగించాలి. కంపెనీలు కేవలం ఆడ ధాన్యం మాత్రమే కొనుగోలు చేస్తాయి. మగ రకం ధాన్యాన్ని రైతులు ఇష్టం వచ్చిన వారికి విక్రయించుకోవచ్చు.

సోయా కొనుగోలు చేయాలని రాస్తారోకో



మద్నూర్‌లో రాస్తారోకో చేస్తున్న రైతులు

మద్నూర్(జుక్కల్): సోయా పంటను కొనుగోలు చేయాలని మద్నూర్ మండల కేంద్రంలో గురువారం రైతులు రాస్తారోకో నిర్వహించారు. మద్దతు ధరకు సోయా కొనుగోలు చేయడానికి స్థానిక మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని ఈ నెల 7న అధికారులు మూసి వేశారు. కొనుగోళ్లు పూర్తయ్యాయని అధికారులు చెబుతున్నారు. కానీ పంట పూర్తిగా కొనుగోలు చేయకుండానే కేంద్రం మూసి వేశారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చాలా రోజులుగా కొనుగోలు కేంద్రానికి రైతులు తీసుకు చ్చిన సోయా పంట అలాగే ఉందని, మధ్యలోనే కొనుగోళ్లు నిలిపి వేయడం ఏంటని రైతులు నిలదీశారు. రైతుల ఆందోళన విషయాన్ని తహసీల్దార్ ముజీబ్ బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయికి సమాచారం అందించడంతో ఆమె వచ్చి రైతులతో మాట్లాడారు. రైతుల సమస్యలను కలెక్టర్, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆమె హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

త్వరలో 'భూ భారతి'

- భూ సమస్యల పరిష్కారం దిశగా చట్టం రూపకల్పన
- త్వరలో అమలులోకి నూతన చట్టం
- ఇన్నాళ్లూ ధరణితో అనేక తిప్పలు



కామారెడ్డి క్రైం: రాష్ట్రంలో త్వరలో భూ భారతి చట్టం అమలులోకి రానుంది. గత ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి వెబ్‌సైట్ కారణంగా లక్షల సంఖ్యలో రైతులు తమ రికార్డుల విషయంలో నానా అవస్థలు పడ్డారు. ఇప్పటికీ పడుతునే ఉన్నారు. ధరణిలో దొర్లిన తప్పిదాలను సరిచేసుకోవడానికి కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. అయినా కూడా ఆప్షన్‌లు అందుబాటులో లేక సమస్యలకు పరిష్కారాలు దొరకడం లేదు. తాము అధికారంలోకి రాగానే ధరణిని రద్దు చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ నాయకత్వం ఇచ్చిన హామీ ప్రకారం ధరణి స్థానంలో నూతన రెవెన్యూ చట్టాన్ని తీసుకురావడానికి ఏర్పాట్లు చేసింది. భూ భారతి పేరుమీద తీసుకువస్తున్న ఈ చట్టానికి గవర్నర్ ఆమోదం ఇటీవల ఆమోదం తెలిపారు. అనేక రకాల భూ సమస్యలకు పరిష్కారాలు భూ భారతి చట్టంతో లభిస్తాయని అధికారులు చెబుతున్నారు. ఇకనైనా తమ భూ సమస్యలకు పరిష్కారాలు దొరుకుతాయని రైతులు గంపెడు ఆశలతో ఎదురు చూస్తున్నారు.

మరికొన్ని ప్రధాన అంశాలు

ధరణిలో ఎదురైన తప్పులను సవరించడానికి చాలా మట్టుకు ఆప్షన్‌లు లేవు. చాలా మందికి కొత్త పాస్‌పుస్తకాలు కూడా రాలేవు. ఇవి కాకుండా వేల సంఖ్యలో పార్ట్‌బి కేసులు ఉన్నాయి. వీటన్నింటికి దాదాపు ఆరేళ్లుగా పరిష్కారాలు దొరకడం లేదు. నూతన చట్టంలో ఇలాంటివి అన్ని పరిష్కారమవుతాయని అధికారులు చెబుతున్నారు. ఇందుకోసం చట్టం ద్వారా తహశీల్దార్, ఆర్డీవో, అదనపు కలెక్టర్‌లకు అధికారాలను కేటాయించనున్నారు. భవిష్యత్తులో భూ వివాదాలకు అస్కారం లేకుండా పకడ్బందీగా సర్వే చేయించి ప్రతి మ్యూటేషన్‌కు కూడా మ్యాప్ తప్పనిసరి చేయనున్నారు. భవిష్యత్తులో గొడవలు రాకుండా వారసత్వ భూములకు పూర్తిస్థాయి విచారణ జరిపిన తర్వాతనే పాస్ పుస్తకాలు ఇస్తారు. ఈ చట్టం ద్వారా సాదాబైనామాలకు కూడా మోక్షం లభించనున్నట్లు తెలుస్తోంది. గ్రామకంఠం, అబాదీ పరిధిలో ఉండే స్థలాలకు కూడా రికార్డు హక్కులను కల్పించనున్నారు. జిల్లా స్థాయిలోనే భూ సమస్యలకు పరిష్కారం కల్పించే విధంగా రెండు అంచెల అప్పీల్ వ్యవస్థతో ట్రిబ్యునల్‌లను ఏర్పాటు చేయనున్నారు. కోర్టులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా జిల్లా స్థాయిలో ట్రిబ్యునల్ ద్వారా భూ తగాదాలను, సమస్యలను పరిష్కరించుకోవచ్చు.

అనేక సమస్యలు

ప్రస్తుతం ఉన్న ధరణి పోర్టల్‌ను పూర్తిగా ప్రక్షాళన చేసిన తర్వాతనే కొత్త చట్టాన్ని తీసుకురానున్నారు. అప్పుడే రికార్డులన్నింటిని చట్టం కింద ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ధరణి వచ్చినప్పుడు రికార్డులను అందులో ఎక్కించడానికి రికార్డుల ప్రక్షాళన కార్యక్రమాన్ని 2018లో అప్పటి ప్రభుత్వం నిర్వహించింది. రెవెన్యూ అధికారులకు తక్కువ సమయాన్ని నిర్దేశించి వెంటనే రికార్డులను ఆన్‌లైన్ చేయాలని ఒత్తిడి తెచ్చారు. రాత్రింబవళ్లు అధికారులు రికార్డులను ఆన్‌లైన్‌లో నమోదు పనులు చేశారు. దీంతో అనేక తప్పిదాలు దొర్లాయి. డమ్మీ ఖాతాలు, పార్ట్‌బి కేసులు, రైతుల పేర్లు, శివారు, సర్వే నెంబర్, విస్తీర్ణం, భూమి రకం లాంటి అనేక వివరాలు తప్పుగా నమోదయ్యాయి. జిల్లాలోనే ఇలాంటి కేసులు దాదాపు 20 నుంచి 30 వేల వరకు ఉంటాయి. అప్పటి నుంచి పరిష్కారం కోసం రైతులు కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

అనుభవదారు కాలమ్

తెలంగాణ భూ భారతి '2024' బిల్లును డిసెంబర్ 20న అసెంబ్లీలో ఆమోదించారు. ముఖ్యంగా ఇందులో పలు మార్పులు తీసుకు వచ్చారు. ధరణి వెబ్‌సైట్ వచ్చేకంటే ముందు మ్యానువల్‌గా ఉండే అన్ని రెవెన్యూ రికార్డుల్లో అనుభవదారు కాలమ్ ఉండేది. ధరణి వచ్చాక ఈ కాలమ్‌ను తొలగించారు. భూ భారతిలో అనుభవదారు కాలమ్‌ను మళ్లీ చేర్చనున్నారు.

తొందర్లోనే అందుబాటులోకి..



ప్రభుత్వం కొత్తగా తీసుకు వస్తున్న భూ భారతి చట్టానికి ఇటీవలే ఆమోదం లభించింది. తొందర్లోనే వెబ్‌సైట్ ద్వారా సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. భూ భారతి వచ్చిన తర్వాత అనేక సమస్యలకు పరిష్కారం లభించవచ్చు. అమల్లోకి రాగానే ప్రతి సమస్యను ఎప్పటికప్పుడు చట్టం ప్రకారం పరిష్కరిస్తాం.

– మసూర్ అహ్మద్, ఏవో, కలెక్టరేట్, కామారెడ్డి

రిజిస్ట్రేషన్ లేని ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న రాష్ట్ర వైద్యారోగ్య శాఖ సంచాలకుడు రవీందర్‌నాయక్

కామారెడ్డి టౌన్: జిల్లాలో రిజిస్ట్రేషన్ లేకుండా కొనసాగుతున్న ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకుడు డాక్టర్ రవీందర్ నాయక్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ ఛాంబర్‌లో వైద్యశాఖ అధికారులు, జాతీయ ఆరోగ్య మిషన్ ప్రోగ్రాం అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ యాక్టు అమలు, ప్రయివేట్ ఆస్పత్రుల రిజిస్ట్రేషన్, ప్రభుత్వ ఆస్పత్రుల సమస్యలపై చర్చించారు. పీహెచ్‌సీలలో అదనపు గదుల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపాలని, హెచ్‌ఆర్ సిబ్బంది కొరత, జిల్లాకు కావలసిన అవసరాల ప్రతిపాదనలు తయారు చేసి పంపాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. స్కానింగ్ సెంటర్లపై ప్రత్యేక శ్రద్ధ వహించి విస్తృత తనిఖీలు చేపట్టాలన్నారు. ఎన్‌సీడీ ప్రోగ్రాంలో బ్లడ్, షుగర్ పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు శిరీష, అనురాధ, విద్య, ప్రభు, ఉదయ్ కిరణ్, మాస్ మీడియా అధికారి వేణుగోపాల్, హెచ్ఈవో చలపతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలి

● జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్



దోమకొండ: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని అదనపు కలెక్టర్ విక్టర్, స్థానిక అధికారులకు సూచించారు. గురువారం చింతమాన్‌పల్లిలో ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, రైతుభరోసా పథకాలపై గ్రామస్తులతో ఆయన మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అందుతాయని అన్నారు. పథకాలకు దరఖాస్తు చేసుకున్న పలువురితో ఆయన మాట్లాడారు. వారి వివరాలను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ సంజయ్‌రావ్, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, మండల వ్యవసాయాధికారి మణిదీపిక, ఏఈవో కృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి రమేష్, తదితరులున్నారు.

సెపక్ తక్రా జాతీయ స్థాయి పోటీల్లో పూజిత ప్రతిభ



పూజిత

కామారెడ్డి అర్బన్: హనుమకొండలో ఈనెల 10 నుంచి 14 వరకు నిర్వహించిన సెపక్ తక్రా సీనియర్ మహిళ జాతీయ స్థాయి పోటీల్లో బాన్సువాడకు చెందిన పూజిత ప్రతిభ చూపి రజత పతకం సాధించినట్లు సెపక్ తక్రా అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేష్, నరేష్‌లు తెలిపారు. ఈ పోటీల్లో మణిపూర్ జట్టు ప్రథమ స్థానం పొందగా, తెలంగాణ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచిందని వారు పేర్కొన్నారు. పూజిత హైదరాబాద్‌లో డిగ్రీ చదువుతోంది. కామారెడ్డి జిల్లా సెపక్‌తక్రా అసోసియేషన్ తరపున సీనియర్ మహిళ జట్టులో పాల్గొని ప్రతిభ చూపింది.

చైనా మాంజాతో ఒకరికి గాయాలు



భిక్కనూరు: మండల కేంద్రంలో చైనా మాంజాతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా.. మండల కేంద్రానికి చెందిన మ్యాదరి సిద్దరాములు తన బైక్‌పై గురువారం సిద్ధరామేశ్వరాలయం రోడ్డు మీదుగా వెళ్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు ఎగురవేసిన పతంగికి సంబంధించిన చైనా మాంజా అతని గొంతుకు అడ్డుగా వచ్చి కోసుకుంటూ వెళ్లింది. దీంతో ఆయన గొంతు వద్ద తీవ్ర గాయమై తీవ్ర రక్తస్రావం జరిగింది. స్థానికులు వెంటనే ఆయనను ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు చికిత్స నిర్వహించారు.

కవితను విమర్శించే స్థాయి కాంగ్రెస్ నేతలకు లేదు

బాన్సువాడ : ఎమ్మెల్సీ కవితను విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదని బీఆర్ఎస్ నాయకులు, మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్ అన్నారు. గురువారం తన నివాసంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 2 లక్షల రుణమాఫీని ఏ గ్రామంలో పూర్తి స్థాయిలో చేసిందో సమాధానం చెప్పాలని అన్నారు. నాయకులు మోచీ గణేష్, శివ, మౌలాన, గౌస్, సాయిలు, రమేష్‌యాదవ్ తదితరులున్నారు.

ఆలయ హుండీ లెక్కింపు



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయ హుండీలను గురువారం లెక్కించారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి ఆలయంలోని హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని చేపడతామని ఆలయ కమిటీ అధ్యక్షుడు బోషివార్ ప్రకాశ్ తెలిపారు. హుండీలో రూ.18వేల830 నగదు, వెండి వస్తువులు వచ్చినట్లు తెలిపారు. ఆలయ ప్రధాన కార్యదర్శి గంగాధర్, భక్తులు ఉన్నారు.

సలహా కమిటీ ఏర్పాటులో కాలయాపన

- గల్ఫ్ బోర్డు ఏర్పాటు కోసం సలహా కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం
- మూడు నెలల క్రితమే ఉత్తర్వులు
- కమిటీ సభ్యుల నియామకం కోసం అడుగులు ముందుకు పడని వైనం
- సలహా కమిటీని నియమిస్తేనే బోర్డు ఏర్పాటుకు మార్గం సుగమం



మోర్తాడ్(బాల్కొండ): గల్ఫ్ వలస కార్మికుల సంక్షేమం కోసం నిర్దేశించిన బోర్డు విధి విధానాలు ఖరారు చేయడానికి సలహా కమిటీని ఏర్పాటు చేస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తుందనే విమర్శలు వస్తున్నాయి. గల్ఫ్ దేశాల్లో మరణించిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల సాయం, వలస కార్మికుల గోడు వినడానికి ప్రవాసీ ప్రజావాణి, వలస కార్మికుల పిల్లలకు గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో సీట్ల కేటాయింపులు, సలహా కమిటీ ఏర్పాటు చేసి బోర్డు ఆవిర్భావానికి మార్గం సుగమం చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. సలహా కమిటీలో వలస కార్మికుల సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రాజకీయ నాయకులకు చోటు దక్కే అవకాశం ఉంది. రాష్ట్ర స్థాయిలో ఏర్పడే సలహా కమిటీ ద్వారానే గల్ఫ్ బోర్డుకు రాష్ట్ర ప్రభుత్వం అంకురార్పణ చేసే అవకాశం ఉంది. మొదటి నుంచి వలస కార్మికుల సంక్షేమంపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సుముఖంగానే ఉంది. ఏకంగా బోర్డును ఏర్పాటు చేయకుండా దశల వారీగానే వలస కార్మికుల వినతులను పరిష్కరిస్తోంది. కేరళ, పంజాబ్ తదితర రాష్ట్రాలలో వలస కార్మికుల కోసం అమలవుతున్న పథకాలను మన రాష్ట్రంలోనూ అందించడానికి ప్రత్యేకంగా గల్ఫ్ బోర్డును ఏర్పాటు చేయాలని కార్మిక సంఘాలు మొదటి నుంచి డిమాండ్ చేస్తున్నాయి. గల్ఫ్‌బోర్డుతో పాటు ప్రవాసీ విధానం(ఎన్ఆర్ఐ పాలసీ) అమలు చేస్తే గల్ఫ్ దేశాలతో పాటు ఇతర దేశాల్లో ఉపాధి పొందుతున్న వలస కార్మికుల కోసం ప్రభుత్వం ఏవైనా పథకాలను అందించడానికి అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఈ అన్ని అంశాలపై అధ్యయనం గతంలో జరిగినా ఈ ప్రభుత్వం వాటిని పరిగణనలోకి తీసుకోకుండా సలహా కమిటీని ఏర్పాటు చేసి కమిటీ సూచనలను పాటిస్తామని ప్రకటించింది. సలహా కమిటీని ఇప్పటికీ ఏర్పాటు చేయకపోవడంతో గల్ఫ్ బోర్డు ఆవిర్భావ ప్రక్రియ ఆలస్యమవుతోందని అంటున్నారు.

వలస కార్మికులతో జరిగే లబ్ధిని దృష్టిలో ఉంచుకొని..

వలసల ద్వారానే రాష్ట్రానికి, కేంద్రానికి ఆదాయ మార్గాలు మెరుగవుతున్నాయి. మన రాష్ట్రం నుంచి గల్ఫ్ దేశాలకు సుమారు 15 లక్షల మంది వలస వెళ్లి ఉంటారని అంచనా. సమగ్ర సర్వే వివరాలు వెల్లడైతే గల్ఫ్ దేశాలకు ఎంత మంది వలస వెళ్లి ఉంటారనే సంఖ్య తేలే అవకాశం ఉంది. గల్ఫ్ దేశాల నుంచి వలస కార్మికులు ప్రతి నెలా వారి వేతనం ఇంటికి పంపిస్తుండటంతో రెండు ప్రభుత్వాలకు ఆదాయం పెరుగుతోంది. వలస కార్మికులతో వచ్చే ఆదాయం వల్ల లబ్ధిపొందుతున్న ప్రభుత్వాలు వారి సంక్షేమంపై దృష్టి సారించకపోవడం విచారకరమనే భావన వ్యక్తం చేస్తున్నారు. సలహా కమిటీ ఏర్పాటుపై ప్రభుత్వం స్పందించాలని కోరుతున్నారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

రామారెడ్డి: రైతు భరోసా, రేషన్ కార్డులకు సంబంధించిన సర్వేను అధికారులు క్షేత్రస్థాయిలో పకడ్బందీగా నిర్వహించాలని, అర్హత కలిగిన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా చూడాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం గొల్లపల్లిలో మండల అధికారులతో కలిసి సర్వేను ఆయన పరిశీలించారు. ఏ ఒక్క లబ్ధిదారుడు సంక్షేమ పథకాలకు దూరమవ్వకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. డీఎల్‌పీవో శ్రీనివాస్, తహసీల్దార్ సువర్ణ, ఎంపీడీవో తిరుపతిరెడ్డి, పంచాయతీ సెక్రెటరీ జనార్ధన్, ఏఈవో రాకేశ్ పాల్గొన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

అడ్లూర్ ఎల్లారెడ్డిలో..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): రేషన్ కార్డుల అర్హుల కోసం చేపడుతున్న సర్వేను పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి సూచించారు. అడ్లూర్ ఎల్లారెడ్డిలో సర్వేను పరిశీలించారు. అలాగే లింగంపల్లిలో జెడ్పీ సీఈవో చందర్ నాయక్ సర్వేను పరిశీలించారు. ఎంపీడీవో సంతోష్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ

కామారెడ్డి టౌన్/ఖలీల్‌వాడి: నిజామాబాద్ ఆర్టీసీ రీజియన్ పరిధిలోని అన్ని ఆర్టీసీ డిపోలలో నేడు డయల్ యువర్ ఆర్టీసీ ఆఫీసర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కామారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్ ఇందిరా, నిజామాబాద్ ఆర్ఎం జ్యోత్స్న వేర్వేరుగా ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4గం.ల నుంచి నుంచి 5గం.లకు వరకు జరిగే ఈ కార్యక్రమం కొనసాగనున్నట్లు తెలిపారు. ప్రయాణికులు స్థానిక ఆర్టీసీ డిపోలలో నెలకొన్న సమస్యలను, సలహాలను, సూచనలను కింది ఫోన్ నెంబర్‌లను సంప్రదించాలని తెలిపారు.

రీజినల్ మేనేజర్, నిజామాబాద్	9959226011
డిపో మేనేజర్, నిజామాబాద్-1	9959226016
డిపో మేనేజర్, నిజామాబాద్-2	9959226017
డిపో మేనేజర్, ఆర్మూర్	9959226019
డిపో మేనేజర్, బోధన్	9959226001
డిపో మేనేజర్, కామారెడ్డి	9959226018
డిపో మేనేజర్, బాన్సువాడ	9959226020

నూతన సంవత్సర క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆశిష్



ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి వరప్రసాద్



ఆవిష్కరిస్తున్న ఏఎస్పీ చైతన్యారెడ్డి

అధ్యాపకుల సంఘం క్యాలెండర్..

కామారెడ్డి టౌన్: తెలంగాణ ప్రభుత్వ అధ్యాపకుల సంఘం నూతన సంవత్సరం క్యాలెండర్‌ను కలెక్టర్ అశిష్ సాంగ్వాన్ ఆవిష్కరించారు. గురువారం కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం, సంఘం జిల్లా అధ్యక్షుడు నీలం నర్సింలు, ప్రధాన కార్యదర్శి రమేష్ రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ అంబీర్ శ్రీనివాసరావు,ఉపాధ్యక్షుడు జయంత్ పాల్గొన్నారు.

టీఎస్–మేసా క్యాలెండర్..

కామారెడ్డి అర్బన్: తెలంగాణ స్టేట్ మైనార్టీస్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్(టీఎస్–మేసా) జిల్లా శాఖ క్యాలెండర్‌ను కామారెడ్డి ఎఎస్పీ చైతన్యారెడ్డి గురువారం ఆవిష్కరించారు. టీఎస్–మేసా జిల్లా అధ్యక్షుడు ఎంఏ బషీర్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ రఫీక్, వర్కింగ్ అధ్యక్షుడు ఎస్ఏ ఖాదీర్, ప్రతినిధులు పాల్గొన్నారు.

న్యాయవాద పరిషత్ క్యాలెండర్..

కామారెడ్డి టౌన్: తెలంగాణ న్యాయవాద పరిషత్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం జిల్లా కోర్టులో ప్రధాన న్యాయమూర్తి వర ప్రసాద్ ఆవిష్కరించారు. న్యాయవాద పరిషత్ జిల్లా అధ్యక్షుడు బి.దామోదర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.సంతోష్ శర్మ, ఉపాధ్యక్షుడు సందీప్ రెడ్డి, కార్యదర్శులు భార్గవ్ చంద్ర భూపాల్, యాదగిరి, కోశాధికారి గంగరాజు, న్యాయవాదులు భూషణ్ రెడ్డి, భూపాల్ పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం క్యాలెండర్..

బాన్సువాడ : పద్మశాలి సంఘం నూతన సంవత్సరం క్యాలెండర్లను గురువారం బాన్సువాడ మార్కండేయ మందిరంలో సంఘం జిల్లా అధ్యక్షులు లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, సంఘం నేతలు రాజయ్య, గంట్యాల బాలకృష్ణ, శ్రీనివాస్, నరహరి, జిల్లా కాశీనాథ్, వెంకటేష్, తదితరులున్నారు.



ఆవిష్కరిస్తున్న పద్మశాలి సంఘం నేతలు

చైన్‌స్నాచర్ల హల్‌చల్

- జంగంపల్లిలో 3తులాల బంగారు చైన్ అపహరణ
- ఆర్గొండలో చైన్ స్నాచింగ్‌కు యత్నం



సీసీ పుటేజీలో రికార్డయిన అనుమానితులు

భిక్కనూరు/రాజంపేట: భిక్కనూరు, రాజంపేట మండలాల్లో గురువారం పట్టపగలే చైన్‌స్నాచర్లు హల్‌చల్ చేశారు. జంగంపల్లి శివారులో ఓ మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును దుండగులు అపహరించగా, ఆర్గొండలో ఓ మహిళ మెడలోనుంచి గోల్డ్‌చైన్‌ను దొంగిలించడానికి యత్నించారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. రామారెడ్డి చెందిన మనెమ్మ తన కుమారుడు భాస్కర్‌తో కలిసి బైక్‌పై రాజంపేట మండలం తలమడ్లలోని బంధువుల ఇంటికి వచ్చింది. గురువారం మధ్యాహ్నం తిరిగి స్వగ్రామానికి బయలుదేరగా, జంగంపల్లి సమీపంలో వెనుకవైపు నుంచి గుర్తుతెలియని వ్యక్తులు వీరి వద్దకు వచ్చారు. వారిని బస్వన్నపల్లి గ్రామానికి దారి కోసం అడిగి మనెమ్మ మెడలో ఉన్న మూడు తులాల బంగారు పుస్తెలతాడును తెంపుకుని వేగంగా బైక్‌పై తలమడ్ల వైపు పారిపోయారు బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు. చైన్ స్నాచింగ్ అనుమానితుల ఫొటోలను పోలీసులు విడుదల చేశారు.

రాజంపేట మండలంలో..

రాజంపేట మండలం ఆర్గొండ గ్రామంలో గుర్తుతెలియని దుండగులు గుండారం వైపు వెళ్తున్న ఆటోను వెంబడించి ఓ మహిళ మెడలోనుంచి బంగారు గొలుసు చోరీకి యత్నించినట్లు తెలిసింది. ఆటోలో ఉన్న మహిళ మెడలోని గొలుసును బైక్ పైనుంచి దుండగులు తెంపేందుకు యత్నించగా ఆటోలో ఉన్న ప్రయాణికులు గమనించారు. వెంటనే దుండగులు కామారెడ్డి వైపు పరారైనట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయపై గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు.

క్రైం కార్నర్

వేర్వేరు ఘటనల్లో పలువురి మృతి



కామారెడ్డి క్రైం: పట్టణ శివారులోని క్యాసంపల్లి క్రాస్ రోడ్డు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. దోమకొండ మండలం లింగుపల్లి గ్రామానికి చెందిన మల్లయ్య (67) ఆస్పత్రిలో ఉన్న తన బంధువును పరామర్శించేందుకు టీవీఎస్ ఎక్సెల్‌పై ఉదయం కామారెడ్డికి వచ్చాడు. సాయంత్రం ఇంటికి తిరిగి వెళ్తుండగా క్యాసంపల్లి క్రాస్ రోడ్డు వద్ద అతడిని వెనుకనుంచి వేగంగా వచ్చిన పల్సర్ బైక్ ఢీకొంది. ఈఘటనలో అతడి తలకు బలమైన గాయం కావడంతోఅక్కడికక్కడే మృతి చెందాడు. దేవునిపల్లి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

కామారెడ్డి క్రైం: పట్టణ శివారులోని జాతీయ రహదారి బ్రిడ్జిపై ఓ వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో మృతిచెందాడు. వివరాలు ఇలా.. పట్టణంలోని బతుకమ్మకుంట కాలనీలో నివాసం ఉంటున్న మహమ్మద్ ఖాసీం (56) జీఎంఆర్ కంపనీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే సిరిసిల్లా రోడ్డుపై ఉన్న జాతీయ రహదారి బ్రిడ్జి వద్ద రేలింగ్ ఏర్పాటు పనులకు హాజరయ్యాడు. ఈక్రమంలో నిజామాబాద్ వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఓ గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి అతడిని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. మృతుడి భార్య సుల్తానా బేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

మురికికాలువలో పడి ఒకరు..

ఖలీల్‌వాడి: నగరంలోని ఆదర్శనగర్‌కు చెందిన చౌహాన్ పీరాజీ(45) మురికికాలువలో పడి మృతి చెందినట్లు ఎస్సై హరిబాబు గురువారం తెలిపారు. చౌహాన్ పీరాజీ ఈనెల 12న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అతడి కుటుంబసభ్యులు మిస్సింగ్ అయినట్లు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం మైసమ్మ కమాన్ వద్ద గల మురికికాలువలో అతడు మృతి చెందినట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించామని పేర్కొన్నారు.

ఆలయాల్లో చోరీల ముఠా అరెస్ట్

- రూ.4 లక్షల సొత్తు రికవరీ
- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ చైతన్య రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ చైతన్య రెడ్డి



స్వాధీనం చేసుకున్న వాహనాలు

కామారెడ్డి క్రైం: కొద్ది రోజులుగా ఉమ్మడి జిల్లా పరిధిలోని పలు ఆలయాలు, ఇతర ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్న ఓ దొంగల ముఠాను కామారెడ్డి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కామారెడ్డి ఏఎస్పీ చైతన్య రెడ్డి వివరాలు వెల్లడించారు. కామారెడ్డికి చెందిన నిమ్మలవోయిన సురేష్, నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం నడిపల్లి గ్రామానికి చెందిన రుద్రబోయిన గణేష్, ఎడపల్లి మండలం తాడెం గ్రామానికి చెందిన గాజుల శ్రీధర్ హౌసింగ్‌బోర్డు ప్రాంతంలో గురువారం అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో దొంగతనాల వ్యవహారం బయటపడింది. తామే చోరీలకు పాల్పడ్డట్టు వారు అంగీకరించారని ఏఎస్పీ తెలిపారు. జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీలో ఉన్న ఐదుగుడుల ప్రాంగణంలోగల సాయిబాబా ఆలయంలో ఈనెల 10న దొంగలు చొరబడి సౌండ్ బాక్స్, ఇతర వస్తువులను ఎత్తుకెళ్లారు. ఆలయ కమిటీ ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. అశోక్‌నగర్‌తోపాటు భిక్కనూరు, దేవునిపల్లి, ఎడపల్లి పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఉన్న ఒక్కో ఆలయంలో చోరీలతో పాటు మరికొన్ని చోట్ల ఒక ఆటో, మూడు బైకులు, రెండు చోట్ల మేకల దొంగతనాలు, ఇలా ఈ ముగ్గురూ కలిసి మొత్తం 11 చోరీలకు పాల్పడినట్లు తేలిందని వివరించారు. నిందితులు ముగ్గురూ పాత నేరస్తులు. గతంలో వీరిపై అనేక దొంగతనాల కేసులు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. నిందితుల వద్ద నుంచి ఆయా కేసుల్లో చోరీ చేసిన మూడు గ్రాముల బంగారం, మూడు బైక్‌లు, ఒక ఆటో, ఏడు జతల వెండి కళ్లు, ట్రాక్టర్ బ్యాటరీ, రెండు మైక్ సెట్‌లు, సెల్‌ఫోన్, ఒక మేకను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. వాటి విలువ మొత్తం రూ. 4లక్షలు వరకు ఉంటుందన్నారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించిన పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్సైలు బాల్‌రెడ్డి, శ్రీరామ్, రాజారామ్, వినయ్ సాగర్, దేవునిపల్లి ఎస్సై రాజు, సిబ్బంది విశ్వనాథ్, విజయ్, రాజు, రామస్వామి, అనిల్ రెడ్డి, నరేష్, రవి, నవీన్‌లను అభినందించారు.

యువతిని వేధించిన ఐదుగురిపై కేసు..

నందిపేట్ (ఆర్మూర్): మండలంలోని సిద్ధాపూర్ గ్రామానికి చెందిన ఓ యువతిని బుధవారం రాత్రి వన్నెల్ కే, సిద్ధాపూర్ గ్రామాలకు చెందిన ఐదుగురు యువకులు కలిసి వెంటపడి వేధిస్తూ దాడికి పాల్పడ్డారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో సాయిరాం, రాహుల్, విగ్నేష్, సృజన్, సాయికిరణ్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

వేర్వేరు కారణాలతో ఇద్దరి ఆత్మహత్య

ఖలీల్‌వాడి: నగరంలోని ఇద్దరు వ్యక్తులు వేర్వేరు కారణాలతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఐదో టౌన్ ఎస్సై గంగాధర్ గురువారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. నాగారంలోని వడ్డెరకాలనీకి చెందిన మక్కల లక్ష్మణ్(29) అప్పుల బాధ భరించలేక ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అలాగే మోపాల్ మండలం నాల్యకల్ గ్రామానికి చెందిన శ్యామ్‌రావు(55) చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శ్యామ్‌రావు చిన్నకుమారుడు అయ్యప్పమాల ధరించడంతో అతడిచి మద్యం తాగడానికి వీలులేకుండాపోయింది. దీంతో అతడు మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు. మృతుల కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చైన్ స్నాచర్ల అరెస్టు



మాట్లాడుతున్న ఎస్సై హరిబాబు

ఖలీల్‌వాడి: నగరంలోని గౌతమ్‌నగర్‌లో చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై హరిబాబు గురువారం తెలిపారు. వివరాలు ఇలా.. ఈనెల 4న నిందితులు చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డారు. విశ్వసనీయ సమాచారం మేరకు నిందితులు సాయి, కీర్తిరాజ్‌లను గుర్తించి వారిని పట్టుకున్నట్లు తెలిపారు. అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఒకరు..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో పరిధిలో నాలుగురోజులక్రితం జరిగిన హత్యాయత్నం ఘటనకు సంబంధించి ఒకరిని అరెస్టు చేసినట్లు పోలీసులు గురువారం తెలిపారు. గ్రామశివారులోని శిఖంభూమిలో పంటలసాగు విషయమై ఈ నెల 13న పలువురి మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘటనపై వెంకంపల్లికి చెందిన చిలుకూరి సురేందర్ రెడ్డి నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో విచారణ చేపట్టిన పోలీసులు గ్రామానికి చెందిన ఆకిడి జమాకర్‌రెడ్డిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. రిమాండ్‌కు తరలించినట్లు నాగిరెడ్డిపేట ఎస్సై మల్లారెడ్డి తెలిపారు.

వివాహేతర సంబంధమే హత్యకు కారణం

- వీడిన బుస్సాపూర్ మర్డర్ మిస్టరీ
- రెండు రోజుల్లోనే ఛేదించిన పోలీసులు
- వివరాలను వెల్లడించిన రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి

బాల్కొండ: మెండోరా మండలం బుస్సాపూర్‌లో ఇటీవల చోటుచేసుకున్న దిలీప్‌శర్మ హత్య ఘటన అక్రమ సంబంధం కారణంగానే జరిగిందని ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి వెల్లడించారు. కేసును రెండు రోజుల్లోనే ఛేదించి, నిందితులను గురువారం అరెస్టు చేశారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. బుస్సాపూర్‌కు చెందిన శ్రీకర్ బస్సు డ్రైవర్‌గా పనిచేస్తుండగా, కోడిచర్లకు చెందిన అక్షయ ఓ ప్రయివేటు పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తుంది. వీరిద్దరికి వివాహం కాలేదు. సన్నిహిత సంబంధం ఉంది. కానీ అంతకుముందు నుంచే అక్షయకు దిలీప్‌శర్మతో వివాహేతర సంబంధం ఉంది. దిలీప్‌శర్మ, శ్రీకర్ బుస్సాపూర్‌లోనే ఉండటంతో ఇద్దరి మధ్య స్నేహం కుదిరింది. ఈక్రమంలో అక్షయను వదిలేయమని శ్రీకర్‌ను దిలీప్‌శర్మ పలుమార్లు బెదిరించాడు. సోమవారం దిలీప్‌శర్మ ఇంట్లో ఎవరు లేకపోవడంతో అక్షయను తీసుకుని తన నివాసానికి రావాలని శ్రీకర్‌కు సూచించగా, వెళ్లారు. ఈక్రమంలో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. ఎలాగైన దిలీప్‌శర్మను వదిలించుకోవాలనుకున్న అక్షయ కూడా శ్రీకర్‌కే మద్దతు పలుకుతూ ఇద్దరు కలిసి సిమెంట్ ఇటుకలతో తలపై మోదీ దిలీప్‌శర్మను హత్య చేశారు. నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసును ఛేదించిన ఎస్సైలు నారాయణ, నరేష్, సిబ్బందిని సీఐ అభినందించారు.

డ్రంకన్‌డ్రైవ్ కేసులో పలువురికి జైలుశిక్ష

ఖలీల్‌వాడి: మద్యం తాగి వాహనాలు నడిపిన 18మందికి సెకండ్ క్లాస్‌మేజిస్ట్రేట్ జైలుశిక్ష విధించినట్లు ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి గురువా రం తెలిపారు. ఇటీవల నిజామాబాద్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలలో వా హనాదారులకు డ్రంకన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈక్రమంలో పట్టుబడ్డవారికి అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించి, కోర్టులో హాజరు పర్చగా వారికి స్పెషల్ జ్యుడీషియర్ 2వ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహన్ బేగం శిక్షలు విధించినట్లు తెలిపారు. నగరంలోని రెండవటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎండీ ఆసాద్ హైమద్, ఐదవటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మోపాల్ మండలం సిర్పూర్ గ్రామానికి చెందిన బద్ది భూమయ్య, అలాగే కంజరకు చెందిన అదంగిరి సాయిలు, ఠాణాకుర్దుకు చెందిన సీహెచ్ స్వామిగౌడ్, నిజామాబాద్ రూరల్ పరిధిలోని ఆదర్శనగర్‌కు చెందిన దయాకర్, మాక్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఒడ్యాట్‌పల్లికి చెందిన చిన్న ఒడ్డెన్నకు ఒక రోజు జైలు శిక్ష విధించారన్నారు. అలాగే పిప్రికి చెందిన చాచేవార్ ప్రదీప్, నిజామాబాద్ రూరల్ పీఎస్ పరిధిలోని మారుతినగర్‌కు చెందిన ప్రకాశ్ నారాయణ్,నిజామాబాద్ రూరల్ పీఎస్ పరిధి లోని గౌతంనగర్‌కు చెందిన భూమయ్య, మోపాల్‌కు చెందిన ఇంధూర్ నాగరాజు, సిరికొండకు చెందిన బండి విజయ్, ఎండ్ల రాకేష్, దు బ్బాక రాజ్ కుమార్,బండెల ధర్మపురి, మండలంలోని పెద్దవాల్గొట్‌కు చెందిన అల్లెపు రమేష్, కొండూర్‌కు చెందిన సాయి, పందిమడుగుకు చెందిన సుంకవక్క నర్సయ్య, చిన్నవాల్గొట్‌కు చెందిన బదాల భాస్కర్‌కు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. అలాగే నగరంలోని ఆర్ఆర్ చౌరస్తా వద్ద డ్రంకన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహించగా ముగ్గురు వ్యక్తులను పట్టుకున్నామని ఎస్సై యాసీన్ ఆరాఫత్ గురువారం తెలిపారు. వారిని కోర్టులో హాజరుపర్చగా ఇద్దరికీ రూ.వేయ్యి చొప్పున జరిమానా విధించగా, ఒకరికి ఒకరోజు జైలుశిక్ష విధించినట్లు తెలిపారు.

సిరికొండ: మండల పోలీస్ స్టేషన్‌లో ఇటీవల నమోదైన పలు కేసుల్లో పలువురికి రెండు రోజుల జైలు శిక్షను ఆర్మూర్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ దత్తు గంగాధర్ విధించారని ఎస్సై రామ్ గురువారం తెలిపారు. డయల్ 100కు తప్పుడు ఫిర్యాదు చేసిన బండి మహేష్, బండి అశోక్‌కు, జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చారని తెలిపారు.